సాక్షి
కర్నూలు

మంగళవారం । 4 । జూలై । 2023

I



0.9 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల జలాశయంలో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం 189 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేస్తున్నారు.



బంగారు హారం బహూకరణ

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారికి గుంటూరుకు చెందిన ప్రదీప్ కుమార్ రూ.6.50 లక్షల విలువ చేసే బంగారు హారాన్ని బహూకరించారు.



శ్రీశైలంలో భక్తులరద్దీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. దర్శన క్యూలు భక్తులతో నిండిపోయాయి.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా మృత్తిక సంగ్రహణ



తులసీవనంతో మృత్తికకు పూజలు చేస్తున్న పీఠాధిపతి సుభుధేంద్రతీర్థులు

మంత్రాలయం: గురు పూర్ణిమను పురస్కరించుకుని సోమవారం శ్రీమఠంలోని తులసీవనంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శాస్త్రోక్తంగా మృత్తిక(మట్టి) సేకరించారు. స్వర్ణపల్లకీలో ఊరేగింపుగా శ్రీమఠానికి తీసుకెళ్లారు. మూలబృందావనం ముందుంచి విశేష పూజలు చేపట్టారు. సేకరించిన మృత్తికను రాఘవేంద్రుల మృత్తిక బృందావనాల స్థాపనకు తీసుకెళ్లడం ఆచారం. రోగ పీడిత భక్తులకు సైతం మృత్తికను అందజేస్తారు. కార్యక్రమంలో శ్రీ మఠం అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

20 పల్లెలకు ట్యాంకర్లతో నీటి సరఫరా

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో 20 పల్లెలకు ఈ నెల 15వ తేదీ వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ పర్యవేక్షక ఇంజినీరు నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఓర్వకల్లు మండలంలో మూడు, కౌతాళం మండలంలో నాలుగు, హొలగుంద మండలంలో ఎనిమిది, హొళగుంద మండలంలో ఒకటి, చిప్పగిరి మండలంలో నాలుగు గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె గ్రామానికి ఈ నెల 31వ తేదీ వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించనున్నామన్నారు. మొత్తం 20 జనావాసాలకు ముందుగా నిర్ణయించిన తేదీ వరకు నీటిని సరఫరా చేసేందుకు రూ.42.05 లక్షలను వెచ్చిస్తున్నట్లు ఎస్ఈ తెలిపారు.

డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ బాధ్యతల స్వీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా మల్లికార్జున సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు పీడీగా పనిచేసిన వెంకటసుబ్బయ్య మాతృశాఖకు వెళ్లడంతో జిల్లా కలెక్టర్ సృజన మల్లికార్జునకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్నారు. బాధ్యతలు స్వీకరించిన మలికార్జునను డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు, సిబ్బంది అభినందించారు. డీఆర్‌డీఏ-వైకేపీ కార్యక్రమాలపై పూర్తి అవగాహన ఉందని, అన్ని అంశాల్లో ప్రగతి సాధించే దిశగా కృషి చేస్తానని మల్లికార్జున తెలిపారు.


ముగిసిన 'ఓపెన్' పరీక్షలు

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు గత నెల 26వ తేదీన ప్రారంభమై సోమవారంతో ముగిశాయి. ఈ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 7 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం పదో తరగతి పరీక్షలకు 185 మందికిగాను 154 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 287 మందికిగాను 240 మంది హాజరయ్యారు.

స్కూల్‌అసిస్టెంట్లకు నేడు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించేందుకు మంగళవారం డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ డాక్టర్ వి. రంగారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 58 గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సీనియారిటీ జాబితా డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

14 మండలాల్లో ఒక మోస్తరు వర్షం



గడివేముల సమీపంలో పొలాల్లో నిలిచిన నీరు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 14 మండలాల్లో వర్షాలు కురిశాయి. కోడుమూరులో 21.8, గూడూరులో 21.2, కోసిగిలో 14.4, సి.బెళగల్‌లో 11.2, మంత్రాలయంలో 9.8 మి.మీ ప్రకారం వర్షపాతం నమోదైంది. వెల్దుర్తి, కల్లూరు, కర్నూలు అర్బన్, గోనెగండ్ల గడివేముల మండలాల్లో కూడా వర్షాలు పడ్డాయి. జిల్లాలో సగటున 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 కాగా.. మొదటి మూడు రోజుల్లో 7.3 మి.మీ వర్షం కురిసింది.

పోషకాల విందు.. భలే పసందు!

- వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం
- డైట్ చార్జీలు పెంచిన ప్రభుత్వం
- అమలులోకి వచ్చిన కొత్త మెనూ
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



సి.బెళగల్ హాస్టల్లో భోజనం చేస్తున్న విద్యార్థులు

కోడుమూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చింది. హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇంటి వాతావరణాన్ని తలపించేలా పసైందైన భోజనాన్ని అందించేందుకు డైట్ చార్జీలు పెంచింది. నూతన మెనూను అమలు చేస్తోంది.

పెరిగిన చార్జీలు..

గతంలో ప్రభుత్వ వసతి గృహాలంటే చులకన భావన ఉండేది. టీడీపీ హయాంలో హాస్టళ్ల నిర్వహణ పూర్తిగా చతికల బడింది. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు అయ్యేదుకాదు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. 'ఇదేమి హాస్టల్‌రా బాబు' అనే విధంగా తల్లిదండ్రులు ఛీత్కరించుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హాస్టళ్లలో వసతులు మెరుగుపడ్డాయి. విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందుతోంది. 2018 జూలైలో డైట్, కాస్మోటిక్ చార్జీలు పెరిగాయి. విద్యార్థులు విద్యలో చురుగ్గా రాణించాలంటే ఆరోగ్యం బాగుండాలని, ఇందుకు పోషకాలతో కూడిన సరైన ఆహారం ఇవ్వాలని భావించి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచారు. పెరిగిన డైట్ చార్జీలతో హాస్టళ్లలో వంట మనుషులు రుచిగా, శుచిగా భోజనం తయారు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. పెరిగిన కాస్మోటిక్ చార్జీలను విద్యార్థినీ, విద్యార్థులు తల నూనె, పౌడర్, సబ్బులు వంటి వాటికి వినియోగిస్తున్నారు.

బలవర్ధకమైన మెనూ

ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మెనూతో విద్యార్థులకు బలవర్ధకమైన పోషకాహారం అందుతోంది. చికెన్ బిర్యానీ, పూరీ, ఇడ్లీ, జీరా రైస్, ఉప్మా, సేమియా పాయసం, రసం, టమాటా బాత్, ఎగ్ టమోటా కర్రీ, చికెన్ కర్రీ ఇలాంటి వంటలతో మూడు పూటలా విద్యార్థులు రుచికరంగా తింటున్నారు.

అడ్మిషన్లు ఫుల్

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖలో ప్రీమెట్రిక్ హాస్టళ్లు 29 ఉండగా ప్రస్తుతం 2,687 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే ఎనిమిది పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో 589 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ప్రీమెట్రిక్ బీసీ సంక్షేమ వసతి గృహాలు 31 ఉండగా..4,969 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. 16 పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో 1,462 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. జిల్లాలో మొత్తం 6 ట్రైబల్ గురుకులాలు ఉండగా 1,500 మంది ప్రవేశం పొందారు. హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపడటం, మెస్‌చార్జీలు పెరగడం, నూతన మెనూ అమలవుతుండడంతో అడ్మిషన్లు పెరుగుతున్నాయి.


పక్కాగా అమలు



వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నూతనంగా మెనూను ప్రవేశపెట్టింది. అందుకు అనుగుణంగా మేం నూతన మెనూను పక్కాగా అమలు చేస్తున్నాం. విద్యారులు సంతోషంగా వసతి గృహాల్లో ఉంటున్నారు.

– రమేష్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, సి.బెళగల్

భోజనం రుచిగా ఉంది



ఈ సంవత్సరం మా హాస్టల్‌లో భోజనం చాలా బాగుంది. మాకు ప్రతి రోజూ రుచికరమైన భోజనం పెడుతున్నారు. స్నాక్స్‌తో పాటు రోజూ పౌష్టికాహారం ఇస్తున్నారు. మంచి భోజనం చేస్తుండటం మాకు చాలా సంతోషంగా ఉంది.

–టి.జగన్, 10వ తరగతి విద్యార్థి, సి.బెళగల్ బీసీ హాస్టల్

గతంలో..

నీళ్ల చారు.. ఉడకని అన్నం.. రుచిలేని కూర.. కనిపించని గుడ్డు.. వసతి గృహం విద్యార్థులకు వడ్డించే భోజనం అధ్వానంగా ఉండేది. డైట్ చార్జీలు అరకొర ఇచ్చేవారు. పర్యవేక్షణ కరువై మెనూ అమలయ్యేది కాదు. విద్యార్థులు అర్థాకలితో అలమటించేవారు.

ప్రస్తుతం..

వారంలో ఏడు రకాల అల్పాహారం.. మూడు రోజులు చికెన్ కర్రీ.. ప్రతి రోజూ ఉడకబెట్టిన గుడ్డు.. రోజూ ఉదయం పాలు, వేరుశనగ చిక్కీ, రాత్రి భోజనం అనంతరం అరటి పండు ఇస్తున్నారు.. హాస్టళ్లలో మెనూ పక్కాగా అమలవుతోంది. డైట్ చార్జీలు పెరగడంతో విద్యార్థులు పోషకాల విందుతో పసందైన భోజనాన్ని రుచిచూస్తున్నారు.

పెరిగిన డైట్ చార్జీల వివరాలివీ..

తరగతి	పాత బిల్లు	కొత్త బిల్లు
3 నుంచి 4 వరకు	రూ.1,000	రూ.1,150
5 నుంచి 10 వరకు	రూ.1,250	రూ.1,400
ఇంటర్ ఆపైనా	రూ.1,400	రూ.1,600

పెరిగిన కాస్మోటిక్ చార్జీల వివరాలు..

3 నుంచి 4వ వరకు		
బాలురు	రూ.100	రూ.125
బాలికలు	రూ.110	రూ.130
5 నుంచి 10వ వరకు		
బాలురు	రూ.125	రూ.150
బాలికలు	రూ.160	రూ.200
ఇంటర్ విద్యార్థులకు		
బాలురు	రూ.125	రూ.200
బాలికలు	రూ.160	రూ.250



విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన భోజనం

ప్రీ-మెట్రిక్ వసతి గృహాల్లో దినసరి మెనూ ఇలా..

వారం	అల్పాహారం	మధ్యాహ్న భోజనం	రాత్రి భోజనం
ఆదివారం	పూరి, బటానీ కుర్మా ఉడకబెట్టిన గుడ్డు	చికెన్ బిర్యానీ, రైతా, గోంగూర చెట్నీ	అన్నం, సాంబారు, పెసరపప్పు, మజ్జిగ
సోమవారం	పులిహోర, పప్పుల పొడి	పాఠశాలలో మధ్యాహ్న భోజనం	అన్నం, గుడ్డు, టమాట కూర, రసం, మజ్జిగ
మంగళవారం	ఇడ్లీ, వేరుశనగచెట్నీ	"	తాళింపు అన్నం, చికెన్ కర్రీ, గోంగూర చెట్నీ, గుడ్డు
బుధవారం	జీరారైస్, కూరగాయ	"	అన్నం, గుడ్డు టమాట కూర, సాంబారు, మజ్జిగ
గురువారం	ఉప్మా, చెట్నీ	"	అన్నం, బెండకాయ ఫ్రై, గుడ్డు, సాంబారు, మజ్జిగ
శుక్రవారం	పొంగలి, చెట్నీ	"	తాళింపు అన్నం, చికెన్‌కర్రీ గోంగూర చెట్నీ, గుడ్డు, రైతా
శనివారం	ఇడ్లీ, చెట్నీ	"	అన్నం, దొండకాయ కూర, పాలకూర పప్పు, మజ్జిగ

- ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు పాలు
- ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలకు వేరుశనగ చిక్కీ
- వారంలో మూడు రోజులు చికెన్
- ప్రతి రోజూ రాత్రి పూట భోజనం తర్వాత అరటి పండు
- సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనంలో అన్నం, సాంబారు, గుడ్డు కూర

'గురు'వైభవం



సాయి నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. బాబాను దర్శించుకుని భక్తులు పరవశించిపోయారు. గురుపౌర్ణమి వేడుకలు సోమవారం వైభవంగా కొనసాగాయి. ఆదోనిలో సాయినాథుడికి పాలాభిషేకం చేశారు. పత్తికొండలో ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి గ్రామోత్సవం జరిపారు. కోడుమూరులో సాయిబాబా చిత్రపటాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. ఎమ్మిగనూరులో చందనోత్సవం కనుల పండువగా సాగింది. – సాక్షినెట్‌వర్క్

శాకాంబరీ నమో నమః



శ్రీశైలంటెంపుల్: ఆషాఢపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి శాకాంబరీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, వివిధ రకాల ఫలాలతో శ్రీభ్రమరాంబాదేవి ఉత్సవమూర్తిని, ఆలయప్రాంగణంలోని రాజరాజేశ్వరీ దేవి, అంకాలమ్మ అమ్మవారిని అలంకరించారు. ఆగమ శాస్త్రానుసారం అమ్మవారికి పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ జరిపారు. శాకాంబరీగా అలంకరించిన అమ్మవారి ఉత్సవమూర్తికి షోడోపచార పూజలు చేశారు. అమ్మవారిని శాకాలతో అర్చించడం వలన సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు పండుతాయని పండితులు తెలిపారు.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

- టోకెన్ల రైజ్, సర్వీసు రిక్వెస్టుల మధ్య వ్యత్యాసం ఉండకూడదు
- సెప్టెంబర్‌లో ప్రాధాన్యత భవన నిర్మాణాలు పూర్తి కావాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, చిత్రంలో జిల్లా అధికారులు

కర్నూలు(సెంట్రల్): జగనన్న సురక్ష పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మండలాధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అభివృద్ధి, సంక్షేమపథకాలపై సమీక్షించారు. జగనన్న సురక్షలో భాగంగా సచివాలయాల పరిధిలో గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. గ్రామసభల నిర్వహణపై ముందుగానే వలంటీర్ల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. టోకెన్ల రైజ్, సర్వీసు రిక్వెస్టు మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నిన్నటి వరకు 81 శాతం సర్వీసు రిక్వెస్టులను జనరేట్ చేశారని, అయితే అందులో ఎన్ని సర్వీసులు డెలివరీ చేశారన్న వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. జగనన్నకు చెబుదాంలో 51 వినతులు రీఓపెన్ అయ్యాయని, వాటిని అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. గూడూరు, పెద్దకడబూరు మండలాల్లో, ఎమ్మిగనూరు అర్బన్‌లో గృహనిర్మాణాల్లో పనుల్లో పురోగతి లేదని, వచ్చే వారానికి ప్రగతి కనిపించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. కర్నూలు అర్బన్ కూడా వెనుకబడి ఉందని, చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజకు సూచించారు. సెప్టెంబర్ 15 నాటికి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలను పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యంను ఆదేశించారు. ఉపాధి పనులను కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, కూలీల హాజరు శాతం ఏ మాత్రం తగ్గకూడదని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డిని ఆదేశించారు. పది రోజుల్లో బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆడుదాం-ఆంధ్రాకు క్రీడా మైదాలను గుర్తించాలని డీఎస్‌ఏ సీఈఓ రమణను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ..కౌలు రైతులకు అవసరమైన సీసీఆర్‌సీ కార్డులను పంపిణీ చేయాలన్నారు. వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రేరీ భవన నిర్మాణాల కోసం భూములను గుర్తించాలని తహసీల్దార్లను ఆదేశించారు.

అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే వినతులను పరిశీలించి వెంటనే పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాటి అనుబంధ సంస్థలు, మునిసిపల్ కార్పొరేషన్‌లు, ప్రజా రవాణా శాఖల్లో 15 ఏళ్లు దాటిన వాహనాల వివరాలను సేకరించాలని డీటీసీని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డీటీసీ అనురాధ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు ఆటంకం

- 108కు తప్పుడు సమాచారం ఇస్తున్నారు
- స్పందనలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు



స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కర్నూలు: రెండు నెలలుగా ఒక వ్యక్తి 7702230785 నంబర్ నుంచి ఫోన్ చేస్తూ రోడ్డు ప్రమాదాలు జరిగాయని అబద్ధాలు చెబుతూ 108 అత్యవసర సేవలకు ఆటంకం కల్గిస్తున్నాడని 108 జిల్లా మేనేజర్ నవీన్ కుమార్, అసోసియేట్ మహేష్ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 108 వాహనాలు 8 ఉండగా అన్నింటికీ కూడా రోడ్డు ప్రమాదాల పేరుతో పలుమార్లు ఫోన్ చేస్తూ తప్పుడు సమాచారమిచ్చి 108 వాహన సేవలకు ఆటంకం కల్గిస్తున్నాడని ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. అతడు కర్నూలుతో పాటు ప్యాపిలి, వెల్దుర్తి, మిడుతూరుతో పాటు మరికొన్ని 108 వాహనాలు ఉన్న కేంద్రాలకు తప్పుడు సమాచారం ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. రెండు నెలలుగా తాము పలుమార్లు అతడు చెప్పిన ప్రాంతాలకు వెళ్లి వెనక్కి వచ్చామని, అక్కడ ఎలాంటి సంఘటనలు జరగకపోగా సమయం వృథా, డీజిల్ ఖర్చు అవుతుందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో ఈ విషయంపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు వారు పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి స్పందనకు వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా స్పందనకు 114 ఫిర్యాదులు వచ్చాయి. స్పందనకు వచ్చిన ఫిర్యాదులన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ యుగంధర్ బాబు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందనలో పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- ఆదోని మార్కెట్ యార్డులో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మార్కెట్ యార్డులో పనిచేస్తున్న ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని కర్నూలు మండలం ఎదురూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు, ఎమ్మిగనూరుకు చెందిన ప్రతాప్ ఫిర్యాదు చేశారు.
- ఆన్‌లైన్‌లో రూ.5 లక్షలు లోన్ మంజూరైందని మెసేజీలు పంపి ఇన్సూరెన్స్, జీఎస్టీ చార్జీల పేరుతో రూ.63 వేలు డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన భారతి ఫిర్యాదు చేశారు.
- కర్నూలు మున్సిపల్ ఆఫీస్‌లో సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నవీన్ అనే వ్యక్తి రూ.1.70 లక్షలు డబ్బు తీసుకుని మోసం చేశాడని కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన నాగభూషణం ఫిర్యాదు చేశారు.
- సాగులో ఉన్న తన పొలాన్ని ఆన్‌లైన్‌లో తన పేరుపై నమోదు చేసుకుని ఒక వ్యక్తి దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని, సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు గ్రామానికి చెందిన సుందర్‌రాజు ఫిర్యాదు చేశారు.
- తమ బాగోగులు చూసుకోకుండా, అన్నం పెట్టకుండా కుమారుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన లక్ష్మన్న ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

చిరుత దాడిలో జింక మృతి

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలోని చిన్న జూలయ్య పొలంలో ఆదివారం రాత్రి జింకను చిరుత పులి చంపింది. సోమవారం పొలాలకు వెళ్లిన రైతులు జింక కళేబరాన్ని చూసి ఆందోళన చెందారు. గత నెల 24వ తేదీన ఇదే గ్రామ సమీపంలోని ముత్తుకూరు కొండల్లో జింకను చిరుత చంపింది. వరుసగా జింకలను చంపుతుండడంతో పొలాలకు వెళ్లే కూలీలు, రైతులు భయాందోళనలు చెందుతున్నారు. తరువగల్లు గ్రామాల్లోని కొండల్లో చిరుత సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. ఇప్పటికైనా చిరుతను బంధించి వేరేచోటకు తీసుకెళ్లాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

2.44 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి లక్ష్యం

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 సంవత్సరానికి పశుసంవర్ధకశాఖ లక్ష్యాలు ఖరారయ్యాయి. ఈ ఏడాది పాలు 2.44 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ఇందుకు అనుగుణంగా పశుసంవర్ధకశాఖ చర్యలు చేపట్టింది. 30వేల టన్నుల మాంసం, 16.20 కోట్ల గుడ్లు ఉత్పత్తి చేసేలా ప్రభుత్వం జిల్లాకు లక్ష్యాలను కేటాయించింది.

- ఈ ఏడాది 21.45 లక్షల జీవాలకు నట్టల నివారణ మందు తాపుతారు.
- 30.70 లక్షల పశుసంపదకు వ్యాక్సినేషన్ చేయిస్తారు.
- 1,14240 పశువులుకు కృత్రిమ గర్భధారణ సూదులు వేస్తారు.
- 34వేల మేలు జాతి దూడల అభివృద్ధి.
- 8వేల ఎకరాల్లో పశుగ్రాసాల సాగు.
- 75 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాల పంపిణీ.
- 10,150 పశువులకు బీమా సదుపాయం.
- గర్భకోశ వ్యాధుల చికిత్సకు 600 వైద్య శిబిరాల నిర్వహణ.
- 400 టన్నుల దాణామృతం పంపిణీ.
- 1000 పాడిపశువులకు లింగనిర్ధారిత సూదులు వేసి పెయ్య దూడల ఉత్పత్తి.

కార్పొరేట్లతో దోస్తీ.. కట్టుకథలు వార్చి!

- అన్నదాతలకు మేలు చేస్తుంటే టీడీపీ నేతల కడుపు మంట
- పచ్చ పత్రిక విషపు రాతలపై రైతుల మండిపాటు
- వైఎస్సార్ హయాంలోనే గని చెరువు నిర్మాణానికి అడుగులు
- చెరువు అభివృద్ధి, మరమ్మతులను గాలికొదిలేసిన నాటి టీడీపీ ప్రభుత్వం
- జగనన్న పాలనలో రూ.1.60 కోట్లతో శరవేగంగా పనులు
- నిబంధనల మేరకే మట్టి తవ్వకాలు, నీటి తరలింపు



గని చెరువు ప్రధాన కట్ట పనులు చేపట్టిన దృశ్యం

గడివేముల: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, చిన్న నీటి వనరుల పునరుద్ధరణ, మరమ్మతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి చరమ గీతం పాడుతూ, ఏటా రెండు పంటలు సమృద్ధిగా పండించుకునేందుకు వీలుగా చెరువుల్ని రూ. కోట్లతో ఆధునీకీకరిస్తున్నారు. అన్నదాతలకు మేలు జరుగుతుంటే టీడీపీ నాయకులు, పచ్చ పత్రికలు జీర్ణించుకోలేకపోతున్నాయి. కళ్లుండీ చూడలేని కబోదుల్లా మారి జరుగుతున్న అభివృద్ధిపై విషప్రచారానికి తెగబడుతున్నారు. అందుకు నిదర్శనమే సోమవారం గని చెరువుపై ఈనాడు అల్లిన 'పూడికతీత...నేతలకు మేత' కథనమే నిదర్శనం.

నాడు గని చెరువు అన్యాక్రాంతానికి టీడీపీ సర్కారు కుట్ర..

గని గ్రామ పరిధిలో ఒకప్పుడు దుర్భిక్ష పరిస్థితులుండేవి. వర్షం కురిస్తేనే పంటలు పండేవి. ఈ దుస్థితిని నివారించటానికి 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గని చెరువు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. సుమారు 230 ఎకరాల్లో దాదాపు రూ.20 కోట్లతో మద్దిలేరు వాగుపై చెరువు నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ చెరువు పరిధిలో ఆరు వందల ఎకరాలకు నీళ్లివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తీరా చెరువు నిర్మాణం పూర్తయిన అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పంట కాలువల ఏర్పాటుతో సహా మిగిలిపోయిన పలు పనుల్ని అటకెక్కించింది. కనీస మౌలిక వసతులు కల్పించి సాగునీరు అందించాలన్న కనీస స్పృహ లేకుండా వ్యవహరించింది. ఈ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో 2016లో చెరువు సమీపంలో సోలార్ పరిశ్రమ ఏర్పాటైంది. అనుమతులు తెచ్చుకున్న భూములతో పాటు సోలార్ ప్లేట్ల ఏర్పాటుకు అత్యంత అనుకూలంగా ఉండటంతో కంపెనీ కన్ను చెరువుపై పడింది. దీన్ని గమనించిన నాటి టీడీపీ నేతలు ఏకంగా కార్పొరేట్ కంపెనీతో కుమ్మక్కై ఏకంగా చెరువును అప్పనంగా కట్టబెట్టాలని దురాలోచన చేశారు. స్థానిక రైతాంగం నుంచి తీవ్రస్థాయి నిరసనలు ఎదురు కావడంతో తాత్కాలికంగా ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు.

అభివృద్ధిపై 'పచ్చ'రాతలు.

గురివింద నలుపు చందంగా గతంలో చేసిన పాపాల్ని కప్పిపుచ్చుకోవటానికి పచ్చ పత్రికల్ని వాడుకుంటూ టీడీపీ నేతలు చేస్తున్న ప్రచారాల్ని రైతన్నలు ఈసడించుకుంటున్నారు. గతంలో మూడుసార్లు మరమ్మతులకు నోచుకోక ప్రధాన కట్ట బలహీనపడి, తూములు శిథిలావస్థకు చేరటంతో సీపేజీ నీటితో పక్కనున్న పొలాలు దెబ్బతినేవి. రైతుల అవస్థల్ని చూసి చలించిన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సోలార్ కంపెనీ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి సీఎస్సార్ నిధుల్ని విడుదల చేయించారు. సోలార్ కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్సార్) కింద కేటాయించిన రూ.1.60 కోట్ల నిధులతో పూడికతీత, ప్రధాన కట్టను బలపరిచే పనులు, తూముల ఆధునీకీకరణ, సీపేజీ నీరు రాకుండా రాతికట్టడం నిర్మాణాలు చేపట్టారు. మరోవైపు పూడిక తీసిన మట్టి, చెరువు నీటిని అమ్ముకుంటున్నారంటూ వచ్చిన దుష్ప్రచారాలను రైతులు తోసిపుచ్చారు. అనుమతుల మేరకే తాము చెరువు మట్టిని తమ పొలాలకు రవాణా చేస్తున్నామన్నారు. మరోవైపు ఆసియాలోనే అతిపెద్దదిగా నిర్మితమౌతున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు యాజమాన్యం లోయర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల కోసం చెరువు నీటిని ట్యాంకర్ల ద్వారా నిబంధనల మేరకే తరలిస్తున్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి



గతంలో చెరువు పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. మట్టిని, నీటిని అమ్ముకుంటున్నారనడం దారుణం. టీడీపీ హయాంలో చెరువు కార్పొరేట్ల పరం కాకుండా గ్రామస్తులమంతా కలిసికట్టుగా అడ్డుకున్నాం. శిథిలావస్థకు చేరుకున్న చెరువు పరిస్థితిని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సీఎస్సార్ నిధులు విడుదల చేయించారు. లేనిది ఉన్నట్లు అభూత కల్పనలు సృష్టిస్తున్న పచ్చ పత్రిక సమాధానం చెప్పాలి.

– శివానందరెడ్డి, ఉప సర్పంచ్, గని గ్రామం

సొంత ఖర్చులతో మట్టి తోలుకుంటున్నాం



చెరువు పూడికతీత మట్టిని జేసీబీ, ట్రాక్టర్ ఖర్చులు సొంతంగా పెట్టుకుని పొలాలకు తోలుకుంటున్నాం. మట్టికోసం ఎవరికీ అదనంగా డబ్బులు ఇవ్వలేదు. ఎవరికీ అవసరమైన మేరకు వారు నిబంధనల ప్రకారం మట్టి తీసుకెళ్తున్నారు. పనులు పూర్తయితే పరిసర పొలాల రైతులకు సాగునీరు అందటమే కాక, భూగర్భ జలాలు సైతం పుష్కలంగా అందుబాటులోకి వస్తాయి.

– మునగాల వెంకటేశ్వర్లు, రైతు, గని గ్రామం

ఓర్వలేకనే కథనాలు



నాకు గ్రామ పరిధిలో రెండెకరాల మెట్ట భూమి ఉంది. పొలం మొత్తం చౌడు స్వభావం ఉండటంతో చెరువు మట్టని తోలుకుని సారవంతంగా మార్చుకున్నాను. నాలాగే గ్రామంలో పలువురు రైతులు తమ పొలాలను బాగు చేసుకుంటున్నారు. దీంతో సన్నకారు రైతులు బాగుపడతారేమోనన్న అసూయతో లేనిపోని కట్టుకథలు ప్రచారం చేస్తున్నారు. చెరువు మరమ్మతులకు సహకరించిన ఎమ్మెల్యే కాటసానికి రుణపడి ఉంటాను.

– చాకలి తిరుపాలు, రైతు, గని గ్రామం

ట్రాన్స్‌ఫార్మర్ రిపేరీతోనే నీటి సమస్య

- సరి చేశామన్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

కర్నూలు(అర్బన్)/మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండలం నారాయణపురం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేరీకి రావడంతో తాత్కాలికంగా నీటి సమస్య ఏర్పడింది. గ్రామంలో 798 మంది జనాభా ఉండగా.. రాంపురం సమగ్ర రక్షిత మంచి నీటి పథకం ద్వారా నీటిని అందిస్తున్నారు. గ్రామంలోని నాలుగు చేతి పంపుల్లో కూడా పుష్కలంగా నీరు ఉంది. కేవలం గ్రామానికి అదనంగా నీటిని అందించే రక్షిత మంచి నీటి పథకం నిర్వహణకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో ఒక్క రోజు మాత్రమే సమస్య తలెత్తిందని ఆదోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కే మురళీధర్‌రావు చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తరాదనే ఉద్దేశంతో రాంపురం సీపీడబ్ల్యూఎస్ నుంచి రెగ్యులర్‌గా సరఫరా చేసే నీటి కంటే అధిక మోతాదులో నీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారన్నారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం



రాంపురం సీపీడబ్ల్యూఎస్ నుంచి కుళాయిలకు వదిలిన నీరు

దురుద్దేశంతోనే ప్రచారం



మా గ్రామానికి కూతవేట దూరంలోనే తుంగభద్ర నది ఉంది. ఊరిలో నీటి సమస్యే లేదు. బోరుకు సంబంధించిన విద్యుత్తు లైన్ జంపర్‌ను సరిచేశారు. ఎవరో కావాలనే విద్యుత్తు సరఫరా నిలిపివేసినట్లు ఉన్నారు. దీంతో పక్క పొలంలో ఉన్న బోరు దగ్గర నుంచి నీరు తెచ్చుకున్నారు. అవి కూడా రోడ్డుకు ఆనుకొని ఉన్న పొలాలే. అడుగు దూరంలో పొలం బోరు ఉండటంతో వెళ్లారు. దురుద్దేశంతోనే ఊర్లో నీటి సమస్య ఉందని ప్రచారం చేశారు.

– తాయప్ప

ఎలాంటి ఇబ్బంది లేదు



ప్రతి రోజూ కుళాయిలకు నీళ్లొస్తున్నాయి. ఎలాంటి ఇబ్బంది లేదు. వేసవిలో కూడా సమస్య రాలేదు. నదిలో నీరు పుష్కలంగానే ఉన్నాయి. బోరు నీరు కూడా అందుతున్నాయి. రెండు పూటల నీరు పట్టుకుంటున్నాం.

– మీనాక్షమ్మ

ఒక్కరోజే సమస్య



విద్యుత్ సమస్య రావడంతో ఒక్కరోజే ఒక్క వీధికి నీటి సరఫరా ఆగిపోయింది. సాయంత్రంలోపు సమస్యను పరిష్కరించారు. పంచాయతీ బోరు నుంచి మాత్రమే నీరు రాలేదు. తుంగభద్ర నది నుంచి వచ్చే నీరు మిగిలిన వీధులకు సరఫరా చేశారు.

– తిమ్మేష్

హత్య కేసులో నిందితుల అరెస్ట్



హత్యకేసు నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: ఎదురూరు గ్రామానికి చెందిన ఈడిగ పెద్ద రామాంజనేయులు గౌడ్(37) హత్య కేసు మిస్టరీ వీడింది. వివాహేతర సంబంధం కారణంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసులు తేల్చారు. హత్యకు పాల్పడిన నిందితులు మద్దూరు జయరాముడు, మద్దూరు రాజు, విష్ణు, రవి, మధు, లక్ష్మన్న, వెంకటరాముడు, వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మలను కర్నూలు మండలం జి.శింగవరం గ్రామ శివారులోని సుంకేసుల రోడ్డులో ఉన్న ఉల్చాల క్రాస్ రోడ్డు వద్ద సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అంతకుముందు కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీరాం, ఎస్‌ఐలు రామయ్య, మన్మథ విజయ్‌లతో కలసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఎదురూరు గ్రామానికి చెందిన మద్దూరు జయరాముడు భార్య ఈశ్వరమ్మతో ఆంజనేయులు గౌడ్ వివాహేతర సంబంధం కొనసాగిస్తుండటం వల్లే పథకం ప్రకారం నిందితులు హత్య చేసినట్లు సీఐ తెలిపారు. ఆంజనేయులు గౌడ్ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత నెల 28వ తేదీన పొలంలో గడ్డి కోసుకోవడానికి వెళ్లగా నిందితులు పథకం ప్రకారం హతమార్చినట్లు చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీఐ హెచ్చరించారు.

ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం


- ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ. 25 లక్షలు పైగా వసూలు

ఆళ్లగడ్డ: తనకు రాష్ట్ర స్థాయిలో పలుకుబడి ఉందని ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షలు వసూలు చేసిన ముఠాపై ఆళ్లగడ్డ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ రమేష్‌బాబు సోమవారం తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన బాలక్రిష్ణ మరికొందరితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. తమకు రాష్ట్రస్థాయి పోలీస్ శాఖలో మంచి పలుకుబడి ఉందని ఎవరైనా ఉంటే ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామని గాలం వేసి రూ. లక్షలు వసూలు చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలోని సద్దాంకాలనీకి చెందిన వంగల రామచంద్రారెడ్డితో పాటు మరి కొంత మంది యువకులు బాలక్రిష్ణ ముఠాకు విడతల వారీగా రూ.25 లక్షల వరకు నగదు ఇచ్చారు. అయితే ఎన్నిరోజులైనా ఇదిగో అదిగో అంటూ పొంతనలేని సమాధానం చెబుతుండటంతో మోసపోయామని తెలుసుకున్న యువకులు పట్టణ సీఐని ఆశ్రయించారు. ఈ మేరకు నిందితులైన విజయవాడకు చెందిన బాలకృష్ణతో పాటు ఓంకార్, సురేష్, రామయ్య, శేఖర్, బాలమద్దిలేటిపై 420 కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.





అవుకులో సాయిబాబాను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు, కర్నూలు అశోక్‌నగర్‌లో సాయినాథుడు



యాగంటి వద్ద భారీ సాయిబాబా విగ్రహం



కర్నూలులో భక్తులతో పోటెత్తిన దక్షిణ షిరిడీ ఆలయం

భక్తికి.. ముక్తికి.. సాయి శరణం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. సాయి నాథునికి అభిషేకాలు చేశారు. భజనలతో గురుదేవున్ని స్తుతించారు. ఆధ్యాత్మిక గురువులు, యోగా గురువులను సన్మానించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

–సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీలో పూజలు..



హోమగుండం చుట్టూ మహిళల ప్రదక్షిణ



అన్నదానం చేస్తున్న సాయి భక్తులు

461 ఆర్‌బీకేలకు వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా పరిహారం

అత్యధికంగా పత్తికొండ మండలానికి రూ.22.45 కోట్లు

- గరిష్టంగా రూ.1.20 లక్షల పరిహారం
- టీడీపీ నేతల కుటుంబాలకూ భారీగా పరిహారం
- పచ్చ మీడియాలో వైఎస్‌ఆర్ పంటల బీమాపై అసత్య కథనాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 466 రైతుభరోసా కేంద్రాలు ఉండగా.. 461 ఆర్‌బీకేల పరిధిలో వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా పరిహారం మంజూరైంది. అత్యధికంగా పత్తికొండ మండలానికి రూ.22,45,67,906 మంజూరు కావడం విశేషం. ఈ మండలంలో 14,845 మంది రైతులకు ప్రయోజనం కలిగింది. ఒక్కో రైతుకు సగటున రూ.15,000 పైగా.. గరిష్టంగా రూ.1.20 లక్షల వరకు పరిహారం లభిస్తోంది. వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా కింద వేలాది మంది టీడీపీ నేతలు, కార్యకర్తలకు కూడా పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతోంది. పత్తికొండ మండలం పందికోనలో టీడీపీ నాయకులుగా గుర్తింపు ఉన్న కుటుంబానికి రూ.1.10 లక్షల బీమా పరిహారం అందనుంది.

- పత్తి, వేరుశనగకు వాతావరణ బీమాను మండలం యూనిట్‌గా అమలు చేశారు.
- వాతావరణ బీమా అమలులో దిగుబడులు ప్రామాణికం కాదు. మండలాల వారీగా అధిక వర్షాలు, అనావృష్టి, ఉష్ణోగ్రతల ఆధారంగా పరిహారం లభిస్తుంది.
- ఈ ప్రకారం మండలానికి, మండలానికి పరిహారంలో హెచ్చుతగ్గులుంటాయి.
- దిగుబడి ఆధారిత బీమా విషయంలో మండలాల వారీగా సగటు దిగుబడులు ఉంటాయి. పంటకోత ప్రయోగాల ఆధారంగా దిగుబడులను బట్టి పరిహారం మంజూరైంది.
- సగటు దిగుబడికి, వచ్చిన దిగుబడికి ఉన్న వ్యత్యాసాన్ని బట్టి పరిహారం వస్తుంది.
- పలు పంటల్లో దిగుబడులు సగటు కంటే ఎక్కువగా ఉండటం వల్ల పరిహారానికి అర్హత రాలేదు.
- వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా కింద పరిహారం పారదర్శకంగా మంజూరైంది. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఆర్‌బీకేల వారీగా సోషల్ ఆడిట్ కోసం జాబితాలు పెట్టడం విశేషం.
- అయితే పచ్చ మీడియా మాత్రం పంటల బీమా–మాటల డ్రామా, కష్టం తీర్చని బీమా అంటూ అసత్య కథనాలు ప్రచురించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా మంజూరైన బీమా వివరాలు

మండలం	రైతులు	క్లెయిమ్ అమౌంటు(రూ.)
ఆదోని	1,770	1,52,01,463
ఆలూరు	12,307	8,77,47,694
ఆస్పరి	17,409	8,82,76,692
సీ.బెలగల్	11,356	9,10,01,406
చిప్పగిరి	4,470	2,54,28,938
దేవనకొండ	10,360	7,02,73,104
గోనెగండ్ల	4,814	5,55,13,177
గూడూరు	1,315	1,55,12,537
హాలహర్వి	7,258	13,85,88,116
హొలగొంద	8,936	6,15,88,414
కల్లూరు	11,877	13,26,84,015
కోడుమూరు	14,576	9,44,82,836
కొసిగి	12,027	6,43,35,681
కౌతాలం	1,656	1,06,05,182
క్రిష్ణగిరి	21,245	14,57,49,217
కర్నూలు అర్బన్	155	18,64,906
కర్నూలు రూరల్	3,133	5,56,73,001
మద్దికెర	3,200	5,01,35,275
మంత్రాలయం	9,951	3,50,71,647
నందవరం	15,776	8,09,03,262
ఓర్వకల్	1,287	2,20,76,305
పత్తికొండ	14,845	22,45,67,906
పెద్దకడుబూరు	11,084	3,83,01,930
తుగ్గలి	14,552	13,52,95,384
వెల్దుర్తి	10,998	5,69,71,946
ఎమ్మిగనూరు	16,069	12,68,90,705
మొత్తం	2,42,426	192,47,40,739

సాక్షి
బిజినెస్
మంగళవారం
4-7-2023

స్టాక్ మార్కెట్లు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	486	65,205
నిఫ్టీ ▲	134	19,323

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్ఈ 100	7,527	▽	4
డాక్స్	16,081	▽	67
షాంఘై	3,244	▲	42
నికాయ్	33,753	▲	564

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	57,730
బంగారం (22 క్యారట్)	54,980
వెండి (కిలో)	75,500

జియో భారత్ ఫోన్ @ రూ. 999

రూ. 123 నెలవారీ ప్లాన్‌తో అపరిమిత కాల్స్, 14 జీబీ డేటా



న్యూఢిల్లీ: టెలికం సంస్థ జియో తాజాగా ఇంటర్నెట్ ఆధారిత చౌక 'జియో భారత్' మొబైల్ ఫోన్లను ఆవిష్కరించింది. దీని ధర రూ. 999. నెలవారీ రీచార్జి రూ. 123గా ఉంటుంది. దీనితో అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది. జూలై 7 నుంచి 10 లక్షల పైచిలుకు జియో భారత్ ఫోన్ల ప్రయోగాత్మక ట్రయల్స్ ప్రారంభమవుతాయని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర ఆపరేటర్లు అందిస్తున్న ఫీచర్ ఫోన్ నెలవారీ ప్లాన్లతో పోలిస్తే 30 శాతం చౌకగా, 7 రెట్లు ఎక్కువ డేటాను యూజర్లు పొందవచ్చని పేర్కొంది. 2జీ విముక్త భారత్ లక్ష్య సాధనను వేగవంతం చేసే దిశగా జియో ఈ మొబైల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 25 కోట్ల పైచిలుకు 2జీ ఫీచర్ ఫోన్లను వాడుతున్నారని అంచనా. ఒకవైపు ప్రపంచం 5జీ విప్లవం ముంగిట నిల్చుండగా.. 25 కోట్ల మంది ఇంకా 2జీ శకంలోనే చిక్కుబడిపోయి ఉన్నారని, ప్రాథమిక ఇంటర్నెట్ ప్రయోజనాలను కూడా పొందడం లేదని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. డిజిటల్ సమాజంలో.. టెక్నాలజీ ప్రయోజనాలు ఏ కొందరికో పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జియో భారత్ ఫోన్ మరో ముందడుగని ఆయన పేర్కొన్నారు.

సెన్సెక్స్ @ 65000

- 19,300 పైకి నిఫ్టీ
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఇంధన, ఆర్థిక, మెటల్ షేర్లకు డిమాండ్
- మూడోరోజూ కొత్త రికార్డుల నమోదు



సెన్సెక్స్ మైలురాళ్లు

స్థాయి	అందుకున్న తేది
65,000	జూలై 03 2023
64,000	జూన్ 28 2023
63,000	నవంబర్ 30 2022
62,000	అక్టోబర్ 19 2021
61,000	అక్టోబర్ 14 2021

ముంబై: సానుకూల జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ సోమవారమూ కొనసాగింది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్ ద్వయం షేర్లు రాణించడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 117 పాయింట్ల లాభంతో 64,836 వద్ద మొదలైంది. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 19,247 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. తొలి గంట తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే మిడ్‌సెషన్ సమయంలో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఇంధన, ఆర్థిక, మెటల్, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లలో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా మూడోరోజూ సెన్సెక్స్ 581 పాయింట్లు పెరిగి 65,300 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు బలపడి 19,345 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేసాయి. చివరికి సెన్సెక్స్ 486 పాయింట్ల లాభంతో 65,205 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా నాలుగోరోజూ లాభాల ముగింపు. మార్కెట్ ముగిసేసరికి 134 పాయింట్లు బలపడి 19,323 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.56%, 0.30% చొప్పున లాభపడ్డాయి. జూన్ వాహన విక్రయాలు అంతంత మాత్రంగా ఉండటంతో ఆటో షేర్లు నష్టపోయాయి. ఐటీ, టెక్, విద్యుత్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.1.73 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ.2.98 లక్షల కోట్లకు చేరింది. ద్రవ్యోల్బణం దిగిరావడంతో కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల సైకిల్‌ను ఆపేయ్యొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఆసియాలో జపాన్ ఇండెక్స్ నికాయ్ 33 ఏళ్ల గరిష్టం(33,753) ముగిసింది.

''మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీతో పలు షేర్ల వాల్యూయేషన్లు భారీగా పెరిగాయి. నిఫ్టీ ఎఫ్‌వై 24 ఆదాయ అంచనాకు 20 రెట్ల అధిక ప్రీమియంతో ట్రేడవుతోంది. ఇది చరిత్రాత్మక సగటు కంటే ఎక్కువ. ప్రస్తుతం నెలకొన్న సానుకూల పరిస్థితులు మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే వీలుంది. ఏదైన చిన్న ప్రతికూలాంశం అనూహ్య దిద్దుబాటుకు దారి తీయవచ్చు. కావున పెట్టుబడులు పెట్టేటప్పుడు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ కుమార్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విలీనం తర్వాత తొలి ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు సానుకూలంగా స్పందించాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు వరుసగా 4%, 3% చొప్పున ర్యాలీ చేసి రూ.2,926 వద్ద, రూ.1,758 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకాయి. చివరికి హెచ్‌డీఎఫ్‌సీ షేరు 2% లాభంతో రూ.2,871 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ఒక శాతం పెరిగి రూ.1,719 వద్ద స్థిరపడింది. మొత్తంగా ఈ రెండు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.93 లక్షల కోటక్లు పెరిగింది.
- ఎన్ఎస్ఈలో బ్యాంక్ నిఫ్టీ సూచీ ఏడాది గరిష్టం (45,353) తాకింది. చివరికి ఒకశాతం లాభంతో 45,158 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండెక్స్ సైతం 52 వారాల గరిష్టం(20,398) అందుకొని ఆఖరికి 1% లాభంతో 20,253 వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం జీవితకాల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి.

మైక్రోచిప్.. రూ.2,460 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంబెడెడ్ కంట్రోల్ సొల్యూషన్స్‌లో ఉన్న యూఎస్ కంపెనీ మైక్రోచిప్ టెక్నాలజీ భారత్‌లో రూ.2,460 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. కార్యకలాపాల విస్తరణ, ఇంజనీరింగ్ ల్యాబ్స్, నిపుణుల నియామకం, సాంకేతిక కేంద్రాలకు మద్దతు, విద్యా సంస్థలకు ఈ మొత్తాన్ని వెచ్చించనుంది. కాగా, ఇక్కడి కోకాపేట్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న వన్ గోల్డెన్ మైల్ ఆఫీస్ టవర్‌లో 5 అంతస్తులను కంపెనీ కొనుగోలు చేసింది. పరిశోధన, అభివృద్ధి కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చింది. ఈ కేంద్రంలో 1,000 మంది ఉద్యోగులు కూర్చునే వీలుంది. భారత్‌లో కార్యకలాపాలను పెంపొందించడానికి మైక్రోచిప్ ముఖ్యమైన వ్యూహాత్మక నిబద్ధతను ప్రకటించిందని సంస్థ ప్రెసిడెంట్, సీఈవో గణేశ్ మూర్తి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఇండస్ట్రియల్, డేటా సెంటర్, కంప్యూటింగ్, ఆటోమోటివ్, కన్స్యూమర్ అప్లయాన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలకు మైక్రోచిప్ సేవలు అందిస్తోంది.

ప్రియం కానున్న టాటా కార్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ధరలను సవరిస్తున్నట్టు ప్రకటించింది. సగటున 0.6 శాతం ధర పెంచుతున్నట్టు సోమవారం వెల్లడించింది. తయారీ వ్యయం పెరగడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్‌తోసహా అన్ని మోడళ్లు, వేరియంట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. కొత్త ధరలు జూలై 17 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ తెలిపింది. జూలై 16 వరకు నమోదయ్యే బుకింగ్స్, జూలై 31లోగా జరిగే డెలివరీలకు పాత ధరలు వర్తిస్తాయని వెల్లడించింది

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ ప్రారంభం..

తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల లావాదేవీలు



గాంధీనగర్: సింగపూర్ ఎస్‌జీఎక్స్ నిఫ్టీ స్థానంలో ప్రవేశపెట్టిన గిఫ్ట్ నిఫ్టీలో సోమవారం నుంచి ట్రేడింగ్ ప్రారంభమైంది. ఎస్‌జీఎక్స్ నిఫ్టీకి సంబంధించిన 9.4 బిలియన్ డాలర్ల ఓపెన్ ఇంట్రెస్ట్‌ను గిఫ్ట్ నిఫ్టీకి బదలాయించగా.. మొదటి రోజున తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల విలువ చేసే లావాదేవీల పరిమాణం నమోదైంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గిఫ్ట్ నిఫ్టీ ట్రేడింగ్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు తమ ట్రేడింగ్‌లో కొంత భాగం విదేశాల్లో జరిగేదని, ఇప్పుడిక పూర్తిగా దేశీయంగానే నిర్వహించవచ్చని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఎండీ ఆశీష్ చౌహాన్, ఎన్ఎస్ఈ ఐఎక్స్ ఎండీ వి. బాలసుబ్రమణియమ్ తెలిపారు.

రెండు సెషన్లలో.. దాదాపు 21 గంటలు..

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్ల మారకంలో జరుగుతుంది. ఉదయం 6.30 గం.ల నుంచి మరుసటి రోజు 2.45 గం.ల వరకు రెండు సెషన్లుగా, దాదాపు 21 గంటల పాటు ఇందులో ట్రేడింగ్ కొనసాగుతుంది. తొలుత గిఫ్ట్ నిఫ్టీ 50, గిఫ్ట్ నిఫ్టీ బ్యాంక్, గిఫ్ట్ నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, గిఫ్ట్ నిఫ్టీ ఐటీ డెరివేటివ్ కాంట్రాక్టులు ఎన్ఎస్ఈ ఐఎక్స్‌లో అందుబాటులో ఉంటాయి. తర్వాత మరిన్ని సూచీలను క్రమంగా అందుబాటులోకి తెస్తారు. సాధారణంగా దేశీ మార్కెట్ల ఓపెనింగ్‌ను అంచనా వేసేందుకు ట్రేడర్లు ఎస్‌జీఎక్స్ నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఓకే

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాతృ సంస్థ ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం కానుంది. పూర్తిగా షేర్ల మార్పిడి ద్వారా లావాదేవీని చేపట్టనున్నారు. ఇందుకు రెండు సంస్థల బోర్డులూ ఆమోదించినట్లు ఐడీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తాజాగా వెల్లడించాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడీఎఫ్‌సీ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేర్లు జారీ చేయనున్నారు. ప్రధానంగా మౌలిక రంగానికి రుణాలందించే ఐడీఎఫ్‌సీ 1997లో ఆవిర్భవించింది. 2015లో ఐసీఐసీఐ, ఐడీబీఐ తరహాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. 2018 డిసెంబర్‌లో క్యాపిటల్ ఫస్ట్‌ను టేకోవర్ చేసింది.

పవన్ హన్స్ విక్రయం రద్దు

గెలుపొందిన బిడ్డర్ అనర్హత ఎఫెక్ట్



న్యూఢిల్లీ: హెలికాప్టర్ సర్వీసుల పీఎస్‌యూ పవన్ హన్స్ లో వ్యూహాత్మక వాటా విక్రయానికి బ్రేక్ పడింది. బిడ్డింగ్‌లో విజయవంతమైన కన్సార్షియంలోని ఒక కంపెనీపై న్యాయపరమైన వివాదాల రీత్యా అనర్హతవేటు పడటం దీనికి కారణమని దీపమ్ పేర్కొంది. వెరసి పవన్ హన్స్ ప్రయివేటైజేషన్ ప్రయత్నాలకు మూడోసారి చెక్ పడింది. బిడ్‌ను గెలుపొందిన స్టార్9 మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ కన్సార్షియంలోని అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీ ఫండ్ ఎస్‌పీసీపై పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం పవన్ హన్స్ డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని రద్దు చేసినట్లు దీపమ్ తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ పవన్ హన్స్‌లో ప్రభుత్వానికి 51 శాతం, ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీకి 49 శాతం చొప్పున వాటా ఉంది.

2018లో షురూ: తొలుత పవన్ హన్స్ లో గల 51 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం 2018లో బిడ్స్‌కు ఆహ్వానం పలికింది. అయితే ఓఎన్‌జీసీ సైతం 49 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధపడటంతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. 2019లో తిరిగి కంపెనీలో 100 శాతం వాటా విక్రయానికి బిడ్స్‌ను ఆహ్వానించినప్పటికీ స్పందన లభించకపోవడం గమనార్హం! ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో మూడోసారి పవన్ హన్స్ విక్రయానికి తెరతీసింది. కంపెనీ కొనుగోలుకి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానించింది. 2022 ఏప్రిల్‌లో స్టార్9 మొబిలిటీ కన్సార్షియం గరిష్ట బిడ్డర్‌గా నిలిచింది. కన్సార్షియంలో అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీసహా.. బిగ్ చార్టర్ ప్రయివేట్ లిమిటెడ్, మహరాజ ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సైతం భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1000 మేనేజర్ స్కేల్-2 పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో మెయిన్ స్ట్రీమ్ కేటగిరీలో మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1000
- » **అర్హత:**ఏదైనా డిగ్రీ,సీఏఐఐబీ ఉత్తీర్ణులై ఉండాలి. పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో ఆఫీసర్‌గా మూడేళ్ల పని అనుభవం ఉండాలి(లేదా) పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో క్లర్క్‌గా ఆరేళ్ల పని అనుభవంతోపాటు సంబంధిత విభాగంలో ఎంబీఏ/ఎంసీఏ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 31.05.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
- » **పే స్కేల్:** నెలకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
- » **పోస్టింగ్ స్థలం:** దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.07.2023
- » **ఆన్‌లైన్ పరీక్ష తేది:**ఆగస్టు రెండు/మూడో వారం
- » **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఐబీపీఎస్ 4,045 క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ)-XIII.. క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:**4,045 క్లర్క్ పోస్టులు
- » **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీస కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- » **వయసు:** 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ఉంటుంది. మొదట 100 మార్కులకు ప్రిలిమ్స్, రెండో దశలో 200 మార్కులకు మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది.
- » **ప్రిలిమినరీ పరీక్ష తేది:**2023 ఆగస్టు/సెప్టెంబర్‌ల్లో
- » **మెయిన్స్ పరీక్ష తేది:** అక్టోబర్ 2023లో నిర్వహిస్తారు
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.07.2023
- » **వెబ్‌సైట్:** www.ibps.in

కేజీబీవీల్లో 1241 కొలువులు



జాబ్స్ ఇన్ఫో

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీవీబీ)లు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్ఎస్)ల్లో 1241 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూన్ 26 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోస్టుల సంఖ్య, అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష స్వరూపం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

పోస్టుల వివరాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీవీబీ)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), పోస్టు గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(పీజీ సీఆర్‌టీ), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులు; అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ ఎస్)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ) పోస్టులు భర్తీ చేయనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య: 1241

- **కేజీవీబీ-పోస్టులు 1218:** స్పెషల్ ఆఫీసర్-38, పీజీ సీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీ సీఆర్‌టీ(మ్యాథమేటిక్స్)-60, పీజీ సీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీ సీఆర్‌టీ(తెలుగు)-104, పీజీ సీఆర్‌టీ(ఉర్దూ)-2, పీజీ సీఆర్‌టీ(బోటనీ)-55, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69,పీజీ సీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీ సీఆర్‌టీ(కామర్స్)-70, పీజీ సీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీ సీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీ సీఆర్‌టీ(జువాలజీ)-54, సీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ(మ్యాథమెటిక్స్)-45,సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77.
- **యూఆర్ఎస్-మొత్తం పోస్టులు-23:** స్పెషల్ ఆఫీసర్-4,సీఆర్‌టీ(తెలుగు)-5, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-5,సీఆర్‌టీ(సైన్స్)-6,సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-3

విద్యార్హతలు

- **పీజీసీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి.
- **స్పెషల్ ఆఫీసర్:** కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణత సాధించాలి.
- **సీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేయాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణతఉండాలి.
- **పీఈటీ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్/డిప్లొమా ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు కనీసం ఏడాది వ్యవధి ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ)లో ఉత్తీర్ణత సాధించాలి.
- కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీ, పీఈటీ, పీజీసీఆర్‌టీ పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దివ్యాంగులు అనర్హులు.

వయసు

2023 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ప్రతిభ, టెట్ స్కోరు, అనుభవం ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. అన్ని పోస్టులకు రాత పరీక్షలో అర్హత సాధించాలంటే.. ఓసీ అభ్యర్థులు 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి. పీఈటీ పోస్టులకు రాతపరీక్షలో మార్కుల(100 శాతం వెయిటేజీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష స్వరూపం

- **పీజీసీఆర్‌టీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **స్పెషల్ ఆఫీసర్:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, స్కూల్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **సీఆర్‌టీ:** ఇందులో కూడా మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **పీఈటీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్‌తోపాటు ఫిజియాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, శిక్షణ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** జూలై 5, 2023
- **రాత పరీక్ష తేది:** జూలై 2023
- **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in

ఐఐటీల్లో కొత్త కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా విద్యార్థుల కోసం పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఐఐటీ గాంధీనగర్ బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును రూపొందించింది. ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-పాట్నాలో బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఐఐటీ బాంబేలో డ్యూయల్ డిగ్రీ ఇన్ క్వాంటం టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు తగిన కోర్సు ఎంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల తీరుతెన్నులు, ప్రవేశం విధానం, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..

ఐఐటీ ఇండోర్

ఈ ఏడాది ఐఐటీ ఇండోర్ ఎక్కువ సంఖ్యలో కొత్త కోర్సులను ప్రారంభించింది. బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, బీటెక్ ఇన్ మ్యాథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్, బీటెక్ ఇన్ స్పేస్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ ఇండోర్ ఈ కోర్సులలో ప్రవేశాలను ప్రారంభించనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐటీ పాట్నా

ఐఐటీ పాట్నా ఈ సంవత్సరం ఇంజనీరింగ్ ఫిజిక్స్‌లో కొత్తగా బీటెక్‌ను ప్రారంభించింది. ఫిజిక్స్‌లో ధ్వని శిక్షణ, విద్యార్థులకు సరికొత్త టెక్నాలజీలను పరిచయం చేయడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. సమకాలీన ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను మిళితం చేసి విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ రెండింటిలో సమాన సామర్థ్యాలుండే నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ కోర్సు లక్ష్యం.

ఐఐటీ బాంబే

ఐఐటీ బాంబే క్వాంటమ్ టెక్నాలజీలో ఇంటర్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఐడీడీపీ)ను త్వరలో ప్రారంభించనుంది. ఈ కోర్సును సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటం ఇన్ఫర్మేషన్ కంప్యూటింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(క్యూయూఐసీఎస్‌టీ) ఆఫర్ చేస్తోంది. ఐఐటీ బాంబేలో ఏదైనా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్) కోర్సులో చేరిన విద్యార్థులు ఐడీడీపీ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవచ్చు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ నిర్మాణం ఇంకా ఖరారు కానప్పటికీ.. రెండేళ్ల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సులో క్వాంటం టెక్నాలజీతోపాటు క్యూయూఐసీఎస్‌టీకి అనుబంధంగా ఉన్న పరిశోధనా బృందంతో చేపట్టే ప్రాజెక్ట్ వర్క్‌కు ప్రాధాన్యతనివ్వనున్నారు. ఇతర డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల మాదిరిగానే ఈ కొత్త కోర్సులో చేరిన విద్యార్థులు ఐదేళ్ల వ్యవధిలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేస్తారు. బీటెక్ విద్యార్థులు సంబంధిత కోర్సు మూడవ సంవత్సరంలో ఈ ప్రోగ్రామ్‌ను ఎంచుకోవచ్చు.



హయ్యర్ ఎడ్యుకేషన్

ఐఐటీ జోధ్‌పూర్

ఐఐటీ జోధ్‌పూర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్.. కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ విత్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. బేసిక్ సైన్స్, అత్యాధునిక సాంకేతికతలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఈ కోర్సును తీసుకువచ్చారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణమైన స్పెషలైజేషన్ల ద్వారా వివిధ కెరీర్ మార్గాలను అందించడం ఈ కోర్సు లక్ష్యం. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగేళ్ల ఈ ప్రోగ్రామ్‌ను ఎనిమిది సెమిస్టర్‌లుగా విభజించారు.

ఐఐటీ హైదరాబాద్

ఐఐటీ, హైదరాబాద్.. బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్‌లో పరిశ్రమ ఆధారిత బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కోర్సును అభ్యసించే విద్యార్థులు బయోలాజికల్ డేటాను అర్థం చేసుకోవడానికి అవసరమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్‌లోనూ శిక్షణ పొందుతారు. ఇది ఎనిమిది సెమిస్టర్లు, నాలుగేళ్ల కాలవ్యవధి ఉన్న ఫుల్‌టైమ్ కోర్సు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకింగ్స్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.

ఐఐటీ గాంధీనగర్

ఐఐటీ, గాంధీనగర్.. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టింది. దీనిలోని కొన్ని సబ్జెక్టులు బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లోని సబ్జెక్టులతో ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. చాలా సబ్జెక్టులు భిన్నంగా ఉన్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకోవచ్చు. ఏఐ,మెషిన్ లెర్నింగ్ లో విద్యార్థులు పట్టుసాధించేలా కరిక్యులాన్ని రూపొందించారు. అంతేకాకుండా ఎలక్టివ్స్ సౌకర్యం ఉండటంతో విద్యార్థులు ఏఐకు చెందిన వివిధ విభాగాలు, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ తదితర అడ్వాన్స్‌డ్ ఏఐ అంశాలను ప్రత్యేకంగా ఎంచుకోవచ్చు.

ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అప్లయిడ్ ఏఐలో అద్భుత కెరీర్ సొంతం చేసుకోవచ్చు. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును నాలుగేళ్లు, ఎనిమిది సెమిస్టర్‌లుగా పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా దీనిలో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీ పాట్నా, ఐఐటీ గువాహటిలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.